క్లుప్తంగా...

సమస్యల పరిష్కారానికి కృషి



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజా సింగ్ తదితరులు

అఫ్జల్‌గంజ్: బేగంబజార్ డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ లోధా అన్నారు. ఈ మేరకు గురువారం బేగంబజార్ డివిజన్‌లోని షాహినాత్‌గంజ్ ప్రాంతంలో రూ.5 లక్షల సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. యాదవ్ అహీర్ భవన్ ప్రాంతంలో రూ.12 లక్షలతో సీవరేజీ పైప్‌లైన్ పనులును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యోగేష్ ముదిరాజ్, దాసరి శేఖర్, ఎం.కృష్ణ, విజయ్‌యాదవ్, సత్యనారాయణ ముదిరాజ్, సునీల్ శర్మ, దేవిదాస్, జై ప్రకాష్ చౌదరి, సందలాల్, గోపాల్ చౌదరి, ప్రదీప్ రాయ్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



చార్మినార్: గౌలిపురా కోట మైసమ్మ ఆలయంలో బుధవారం జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమల్లో ఆలయ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.ఎస్.ఆనంద్‌రావుతో పాటు జి.సైదులు దంపతులు పాల్గొన్నారు.

నోముల సత్యనారాయణకు ఘన నివాళి



నోముల సత్యనారాయణ పుస్తకాలను అందిస్తున్న దృశ్యం

గోల్కొండ: కవిత, రచయిత దివంగత నోముల సత్యనారాయణ తెలుగు భాషకు చేసిన సేవలు మూల్యమైనవని గోల్కొండ ప్రభుత్వం డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కలిలవాయి శ్రీనివాసరాజు అన్నారు. గురువారం గోల్కొండలోని కళాశాలలో నోముల సత్యనారాయణ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇదే కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్న నోముల సత్యనారాయణ కుమారుడు రనజీష్ జన్మదినం కూడా ఈరోజు కావడంతో ఆయన జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నోముల సత్యనారాయణ రాసిన పలు పుస్తకాలను కళాశాల గ్రంథాలయానికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మంజూర్ హుస్సేన్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ మహ్మద్ అన్వరుద్దీన్, సయ్యద్ ఫరీదుద్దీన్ తదితరులున్నారు.

ఉత్తమ సేవకు అవార్డులు



ఆర్టీసీ సిబ్బందితో డిప్యూటీ రీజినల్ మేనేజర్ విజయభాను

గోల్కొండ: సిబ్బంది క్రమశిక్షణ, అత్యుత్తమ పని విధానంతోనే నేడు ఆర్టీసీ లాభాల బాటలో పరుగులు తీస్తుందని ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ విజయ భాను అన్నారు. గురువారం మెహిదీపట్నంలోని ఆర్టీసీ డిపోలో జూన్, జూలై నెలలకు గాను అత్యుత్తమ కేఎంపీఎల్, అత్యధిక ఈపీకే సాధించిన కార్మికులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాధనలో ఆర్టీసీ సిబ్బంది ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ డీవీకే మూర్తి, అసిస్టెంట్ డిపో మేనేజర్ నమ్రత తదితరులు ఉన్నారు.

మొఘల్‌పురా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పండరీ



గౌలిపురా: మొఘల్‌పురా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బి.పండరీ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన అక్రం బాబా మల్టీజోన్-2కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పండరీని పదోన్నతిపై మొఘల్‌పురా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. 2019 బ్యాచ్‌కు చెందిన పండరీ చిలకలగూడ, షాహీనాథ్‌గంజ్, సీసీఎస్, చార్మినార్, ఎస్‌బీ, తిరుమలగిరి ట్రాఫిక్ పీఎస్‌లో ఎస్సైగా విధులు నిర్వహించి మొఘల్‌పురా పీఎస్‌కు పదోన్నతిపై డీఐగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

వచ్చే ఏడాది కూడా ఘనంగా నిర్వహిద్దాం

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



మంత్రి తలసానిని సన్మానిస్తున్న ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ తరఫున ప్రతినిధులు

చార్మినార్: ఈసారి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను ప్రభుత్వ సహాయ సహకారాలతో వైభవంగా నిర్వహించామని.. ఇందుకు సహకరించిన సీఎం కేసీఆర్‌తో పాటు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ తరఫున ప్రతినిధుల బృందం ధన్యవాదాలు తెలిపింది. గురువారం ఉదయం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన ప్రతినిధుల బృందం ఆయనకు బొకే అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. బోనాల జాతర ఉత్సవాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటూ ఉత్సవాలను బ్రహ్మాండంగా జరిగేటట్టు ఆర్థిక సాయం అందజేశామన్నారు. అలాగే వచ్చే ఏడాది కూడా బోనాల జాతర ఉత్సవాలను బ్రహ్మాండంగా నిర్వహించుకుందామన్నారు. పోలీసు, దేవాదాయ, జీహెచ్ఎంసీ, విద్యుత్, జలమండలి ఇలా ప్రభుత్వ విభాగాలకు చెందిన అందరూ ఉన్నతాధికారులు, సిబ్బంది బోనాల జాతర ఉత్సవాలకు ఎంతో శ్రమించారన్నారు. ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్, మాజీ అధ్యక్షుడు గాజుల అంజయ్య, పాటిల్ సదానంద్‌యాదవ్, మధుసూదన్‌గౌడ్, ప్రతినిధులు మధుసూదన్‌యాదవ్, అనంతోజు హన్స్‌రాజ్, కె.ఎస్.ఆనంద్‌రావు, దినేశ్, రాందేవ్ అగర్వాల్ పాల్గొన్నారు.

సాలార్ బ్రిడ్జి విస్తరణకు చర్యలు తీసుకోవాలి



బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: నానల్‌నగర్ డివిజన్‌లోని హకీంపేట్ సాలార్ బ్రిడ్జి విస్తరణకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఈ మేరకు గురువారం బల్దియా కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన సాలార్ బ్రిడ్జి విస్తరణ ఆవశ్యకత గురించి కమిషనర్‌కు వివరించారు. సాలార్ బ్రిడ్జి పరిసరాల్లో ఎన్నో వాణిజ్య సముదాయాలతో పాటు సుమారు 20 కాలనీలు ఉన్నాయని ఆయన అన్నారు. అయితే సాలార్ బ్రిడ్జి చుట్టూ ఆక్రమణలు ఉండటంతో ట్రాఫిక్ జామ్ వంటి ఎన్నో ఇబ్బందులు ఉన్నాయన్నారు. మరోవైపు సాలార్ బ్రిడ్జి సమీపంలో వ్యాపార సముదాయాలు ఉండటంతో ఈ ప్రాంతం ఎప్పుడూ రద్దీగా ఉంటుందని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్‌తో పాటు బంజారాహిల్స్ వెళ్లేవారు టోలిచౌకి మీదుగా సాలార్ బ్రిడ్జి గుండా వెళ్తారని ఆయన తెలిపారు. బ్రిడ్జి కిందజాగాను ఆక్రమించుకుని ఎందరో ఆక్రమించుకుని నివసిస్తున్నారని, వారిని ఖాళీ చేయించి విస్తరణ పనులను చేపట్టాలన్నారు. బల్దియా సెంట్రల్ జోన్ జోనల్ కమిషనర్ వెంకటేష్‌తో మాట్లాడి సాలార్ బ్రిడ్జి విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించేలా ఆదేశిస్తానని బల్దియా కమిషనర్ హామీ ఇచ్చారు.

ఆధ్యాత్మిక భావాలతో మానసిక ప్రశాంతత



భాగవత్ కథలో పాల్గొన్న నందకిశోర్ వ్యాస్ బిలాల్, ధినేష్‌మాన్‌సింగ్, విజయ్‌శంకర్ చౌదరి

అబిడ్స్: ఆధ్యాత్మిక భావాలతో మానవాళికి మానసిక ప్రశాంతత చేకూరుతుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్, ప్రముఖ సంఘ సేవకుకుడు ధినేష్ మాన్‌సింగ్ పేర్కొన్నారు. బేగంబజార్ మహేశ్వరీ భవన్‌లో నిర్వహించిన భాగవత్ కథ వేడుకల్లో నందకిశోర్ వ్యాస్ బిలాల్, ధినేష్ మాన్‌సింగ్ పాల్గొని ప్రసంగించారు. యాంత్రిక జీవనంలో మనిషి ఉత్సాహంగా, ఉల్లాసంగా, ఆనందకరంగా జీవించేందుకు ఆధ్యాత్మిక భావాలే దోహద పడుతాయన్నారు. మనిషి ప్రశాంతంగా ఎంతో శాంతియుతంగా జీవనం పొందేందుకు భాగవత్ కథలు మనిషిని మేల్కొల్పుతాయన్నారు. ఈ వేడుకల్లో విజయ్ శంకర్ చౌదరి, అవినాష్ ఖలీఫా, రమేష్‌కుమార్ బంగ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు నందకిశోర్ వ్యాస్ బిలాల్, ధినేష్ మాన్‌సింగ్, విజయ్‌శంకర్ చౌదరి, అవినాష్ ఖలీఫాలను నిర్వాహకులు సత్కరించారు.

బీఆర్ఎస్ హయాంలోనే గోషామహల్ అభివృద్ధి



సమావేశంలో నందకిశోర్ వ్యాస్ తదితరులు

అబిడ్స్: బీఆర్ఎస్ హయాంలోనే గోషామహల్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జి నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. నిరంతరం సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అందరికీ అందిస్తున్నట్లు వివరించారు. గురువారం బేగంబజార్‌లో పిల్లలకు బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం నలుమూలలా ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తెస్తే వెంటనే పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పప్పుమాత్రే, మేకల విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు ఆయుధం లాంటిది

విజయనగర్‌కాలనీ: ఓటు ఆయుధం లాంటిదని జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొన్నారు. గురువారం ఆసిఫ్‌నగర్, విజయనగర్‌కాలనీ ప్రాంతాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు ఎంతో ముఖ్యమైనదని, 18 ఏళ్లు నిండినవారందరూ ఓటరుగా నమోదు చేసుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ కైసర్, జీహెచ్ఎంసీ తదితరులు పాల్గొన్నారు.



ఓటరు నమోదు పత్రాన్ని అందజేస్తున్న జీహెచ్ఎంసీ అధికారి

సమాజ సేవకే జీవితం అంకితం



ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను సత్కరిస్తున్న మార్కెటింగ్ మాజీ డైరెక్టర్ సతీష్‌కుమార్

అబిడ్స్: సమాజ సేవకే జీవితం అంకితమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. జీవితాంతం ప్రజలకు సేవచేసేందుకు ముందుంటానన్నారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన మార్కెటింగ్ మాజీ డైరెక్టర్ టి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నాగేందర్‌ను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్లగా ప్రజా సేవలోనే ఉన్నానని పేర్కొన్నారు. నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడితే ప్రజల కోసం అహర్నిశలు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు అందరికీ అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దానం నాగేందర్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు సతీష్‌కుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగల ముఠా సభ్యుడి అరెస్ట్

దూద్‌బౌలి: ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాలోని ఓ వ్యక్తిని దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు హుస్సేనీఆలం పోలీసులతో కలిసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఫూల్‌బాగ్‌కు చెందిన ఫర్హాన్ అహ్మద్ (20) ఆటో డెంటింగ్ పని చేస్తున్నాడు. జల్సాలకు డబ్బులు సరిపోకపోవడంతో నలుగురు స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనాలను చోరీ చేయడం ప్రారంభించారు. ఇందులో హుస్సేనీఆలం, చార్మినార్, కామాటిపురా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో నకిలీ తాళాలను తయారు చేసి 9 ద్విచక్ర వాహనాలను దొంగలించారు. నంబర్ ప్లేట్లను మార్చి వాటిపై దర్జాగా తిరుగుతుంటారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు హుస్సేనీఆలం పోలీసులతో కలిసి బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ప్రధాన నిందితుడు ఫర్హాన్ అహ్మద్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 9 ద్విచక్ర వాహనాలు, లక్ష రూపాయల నగదును స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి తదుపరి విచారణ నిమిత్తం హుస్సేనీఆలం పోలీసులకు అప్పగించారు. హుస్సేనీఆలం పోలీసులు ఫర్హాన్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ తెలిపారు. వీకర్ సెక్షన్ కాలనీ, అత్తాపూర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన ఎంఐఎం నేతలు

లంగర్‌హౌస్: అధికారులకు ప్రజల పూర్తి సహకారం ఉంటుందని ఎంఐఎం నాయకురాలు, కార్వాన్ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు మత్స రేణుక అన్నారు. గోల్కొండ నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన అహల్యను ఆమె పలువురు నాయకులతో వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

పోలీస్‌స్టేషన్ సరిహద్దులను పరిశీలించిన డీసీపీ



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ సీహెచ్.రూపేశ్ సందర్శించారు. ఈ సందర్భంగా సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధులు, సరిహద్దులు, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ మహ్మద్ గౌస్, సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శివచంద్ర, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

జహీరుద్దీన్ అలీ ఖాన్ మృతి తీరని లోటు

చార్మినార్: సియాసత్ ఉర్దూ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీ ఖాన్ మృతి తీరని లోటని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. బుధవారం వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు.

చెన్నై సిల్క్స్ షోరూమ్‌లో చోరీ

అబిడ్స్: చెన్నై సిల్క్స్ షోరూమ్‌లో చోరీ జరిగిన ఘటన గుడిమల్కాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. మెహిదీపట్నంలోని చెన్నై సిల్క్స్ షోరూమ్‌కు బుధవారం రాత్రి సిబ్బంది తాళం వేసి వెళ్లారు. గురువారం ఉదయం వచ్చి చూసే సరికి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. నాలుగు కిలోల వెండి, ఒకొక్కటి రూ.10 వేలు విలువ చేసే 12 చీరలు, దొంగిలించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా ప్రపంచ సింహాల దినోత్సవం

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కులో గురువారం ప్రపంచ సింహాల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సాధారణ సందర్శకుల కోసం జూనియర్, సీనియర్, జనరల్ విభాగాల్లో డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో దాదాపు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు జూపార్కు డిప్యూటీ క్యూరేటర్ నాగమణి బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించాలి

సుల్తాన్‌బజార్: నేషనల్ హెల్త్ మిషన్ అండ్ హెచ్ఎం స్కీమ్‌లో దాదాపు 15 వేల మంది కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పద్ధతిన వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారని 20 ఏళ్లుగా పనిచేస్తున్న వీరందరినీ వెంటనే పర్మనెంట్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, యూనియన్ ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. నేడు ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కోఠిలోని కమిషనర్ కార్యాలయం ముందు వందలాదిమంది కార్మికులతో మహా ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ఎంస్కీమ్‌లో పని చేస్తున్న డాక్టర్లను ఏ మాదిరిగా రెగ్యులరైజ్ చేశారో అదే మాదిరిగా మిగతా క్యాడర్ సిబ్బంది అందరిని కూడా క్రమబద్ధీకరించాలన్నారు. లేని పక్షంలో సమ్మెతో సహా ఆందోళన కార్యక్రమాలను నిర్వహించినట్లు వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం, బాపు యాదవ్, సుమన్, నరసింహ, రేవతి, నీలం, మీనాక్షి రజిత జయలక్ష్మీ భవాని బాలకృష్ణమ్మ పావని, సునిత, అనిత, సాగర్, జైపాల్ పాల్గొన్నారు.



కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసేవరకు పోరాడతాం



ఎన్‌వీఎన్ చౌదరి

నాంపల్లి: దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో బుధవారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో జరిగిన నిరసన ప్రదర్శనకు కార్మికులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు నాగళ్ల వెంకన్న చౌదరి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాగళ్ల వెంకన్న చౌదరి కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. కార్మికుల డిమాండ్లు పరిష్కారమయ్యేంత వరకు పోరాటం సాగిస్తామని తెలిపారు. భారత రైల్వే వచ్చిన కొత్త పెన్షన్ స్కీమ్‌తో కొత్తగా ఉద్యోగంలో చేరిన కార్మికులకు తీవ్ర నష్టం చేకూరుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు తీవ్ర నష్టాన్ని చేకూర్చే కొత్త పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2004 నుంచి కొత్త పెన్షన్ విధానం అమలులో ఉందని, అప్పటినుంచి కార్మికులకు నష్టం వాటిల్లుతున్నట్లు చెప్పారు. భారత సైన్యానికి అమలులో ఉన్నట్లే రైల్వేలో కూడా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు ఏ.ఎస్.శ్రీనివాస్, వర ప్రసాద్, శ్రీజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మోతీలాల్ మరణం తీరని లోటు



నివాళులర్పిస్తున్న బోనాల శ్రీనివాస్ తదితరులు

అఫ్జల్‌గంజ్: ప్రముఖ సంఘ సేవకుడు మోతీలాల్ తివారీ మరణం తీరనిలోటని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. బేగంబజార్ పంచాయితీబడాకు చెందిన మోతీలాల్ తివారీ మృతి చెందారు. గురువారం ఆయన చిత్రపటానికి బోనాల శ్రీనివాస్ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ధర్మేంద్ర కుమార్, పోకర్‌మాల్ తివారి, చంపాలాల్ తివారి, కాశీరామ్ తివారి, చంపాలాల్ వ్యాస్, మున్నాలాల్ తివారి, ఘన్‌శ్యామ్ తివారి, మహేష్ తివారి, మహావీర్ ప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా జాతీయ జెండా ఎగరవేస్తాం



అబిడ్స్: స్వాతంత్ర్య సంబరాలను పురస్కరించుకుని 13న ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వి.పాండుయాదవ్ పేర్కొన్నారు. గోషామహల్, కార్వాన్, చార్మినార్ నియోజకవర్గాలతో పాటు అన్ని ప్రాంతాల్లోని ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసి స్వాతంత్ర్య సంబరాలు పెద్ద ఎత్తున జరుపుకోవాలని పిలుపునిచ్చారు. తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రజల్లో జాతీయత భావాలు పెంపొందించేందుకు జాతీయతపై ప్రతి ఒక్కరిలో అవగాహన కలిగే విధంగా ప్రధాని మోదీ ప్రభుత్వం విశేషంగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోని మేరీ మట్టి-మేరా దేశ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్ని తెలిపారు.

ఇంటిని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఇంటి వద్ద నిరసన తెలుపుతున్న సామ్యుయేల్

నాంపల్లి: తాను అద్దెకుంటున్న ఇంటిని కూల్చివేశారని ఓ వ్యక్తి నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. పోలీసు శాఖలో పనిచేసి రిటైర్డ్ అయిన ఏ. జాన్ కుటుంబ సభ్యులతో కలిసి రెడ్‌హిల్స్ జంగంబస్తీలోని 11-6-824 ఇంట్లో గత 65 ఏళ్లుగా అద్దెతో ఉంటున్నారు. జాన్ మృతి అనంతరం ఆయన కుమారుడు ఏ.సామ్యుయేల్ అదే ఇంట్లో ఉంటూ విజయవాడలోని ప్రజా పౌర సరఫరాల శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పని చేస్తున్నాడు. బుధవారం ఆయన కుటుంబ సభ్యులు విజయవాడలో ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి సామాన్లు బయట విసిరేశారు. అనంతరం ప్రొక్లెయిన్‌తో ఇంటిని కూల్చి పారిపోయారు. స్థానికులు గమనించి ఏ.సామ్యుయేల్‌కు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన హైదరాబాదుకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇంటిని కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరాడు.

నాలా అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సమీనా బేగం

యాకుత్‌పురా: బస్తీలో ప్రజలకు డ్రైనేజీ మురుగు నీటి సమస్యలు తలెత్తకుండా నాలా అభివృద్ధి పనులను చేపట్టామని తలాబ్‌చంచలం కార్పొరేటర్ సమీనా బేగం తెలిపారు. డివిజన్ పరిధిలోని భవానీనగర్, నషేమాన్‌నగర్, చాచా గ్యారేజీ ప్రాంతాల్లో చేపట్టిన నాలా అభివృద్ధి పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అన్ని బస్తీల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నాలా అభివృద్ధి నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరలో పూర్తి చేసేందుకు అధికారులకు సూచనలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ నాయకులు మహ్మద్ జాఫర్, యూసుఫ్ మాలిక్, మహమూద్, ఇబ్రహీం, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ మహ్మద్ గౌస్

సంతోష్‌నగర్: ఇళ్ల తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించారు. గురువారం ఐ.ఎస్.సదన్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ మహ్మద్ గౌస్, ఇన్‌స్పెక్టర్, టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి వివరాలను వెల్లడించారు. బిస్మిల్లా కాలనీ షాహీన్‌నగర్ ప్రాంతానికి చెందిన హబీబ్ మహమ్మద్ అలియాస్ ఛోటు (35)పై నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో 42 కేసులు నమోదై ఉన్నాయి. 2022లో చాంద్రాయణగుట్ట పోలీసులు హబీబ్ మహ్మద్‌ను నాన్ బెయిలెబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ)పై జైలుకు పంపించగా 2023లో విడుదలయ్యాడు. జైలు నుంచి వచ్చాక గత నెల 12వ తేదీన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వట్టేపల్లి సైఫీ కాలనీలో ద్విచక్ర వాహనాన్ని దొంగిలించాడు. దొంగలించిన వాహనం రిజిస్ట్రేషన్ నంబర్‌ను మార్చి గత నెల 25 తేదీన రాత్రి సంతోష్‌నగర్ కనక దుర్గా దేవాలయం సమీపంలోని ఓ ఇంటి తాళాలను పగలగొట్టి చోరికి పాల్పడ్డాడు. అదే నెల 31న సంతోష్‌నగర్ కాలనీలోని మరో ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. విశ్వసనీయమైన సమాచారం మేరకు సౌత్, ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఐ.ఎస్.సదన్ పోలీసులతో కలిసి నిందితుడు హబీబ్‌ను అరెస్ట్ 11.30 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.